FREE
SAP, QA TRAINING
BEST SALARY, SHARING

ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

Sunday , April 22, 2007 22:56 hrs IST



# ఇంటర్నెట్‌లో 'కారా' కథానిలయం

తెలుగు విశ్వవిద్యాలయం: ప్రముఖ కథారచయిత డా॥ కాళీపట్నం రామారావు (కారా) సేకరించిన కథల సంపుటాల్లోని ప్రసిద్ధ కథలన్నీ ఇప్పుడు మన ఇంట్లోనే కూర్చుని కంప్యూటర్ తెరపై చదువుకునే అవకాశం వచ్చింది. తెలుగు కథల మనుగడకు శాశ్వత స్వావలంబన చేకూర్చే లక్ష్యంతో ప్రవాసాంధ్రుల సంస్థైన సిలికానాంధ్ర ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఆరంభించింది. తెలుగు కథలన్నిటినీ ఒక చోట చేర్చే క్రమంలో ఎన్నో ఏళ్ళ కృషి ఫలితంగా 'కారా' నెలకొల్పిన 'కథానిలయం' పేరుతోనే ఇంటర్‌నెట్‌లో ఈ కథల్ని ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చారు. తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కారా స్వయంగా సిలికానాంధ్ర కథానిలయం వెబ్‌సైట్‌ను లాంఛనంగా ఆరంభించారు. www.kathanilayam.com లేదా www.kathanilayam.org చిరునామాలో వందలాది కథలు పాఠకుల కోసం సిద్ధం. సీనియర్ రచయితలతో పాటు వర్ధ, ప్రవర్ధమాన రచయితలూ తమ కొత్త కథల్ని వెబ్‌లో ఉంచుకుని పాఠకుల్ని ప్రోదిచేసుకోవడంతో పాటు ఆర్థికపరమైన మద్దతును పొందే అవకాశం ఉందని సిలికానాంధ్ర ప్రతినిధి కూచిభొట్ల ఆనంద్ చెప్పారు. ఇంటర్నెట్ వీక్షకులు కథల్ని చదవడంతో పాటు శాశ్వతంగా వాటిని భద్రపరుచుకోవడం, ముద్రించుకునే అవకాశం కథానిలయం వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా సిలికాన్ వ్యాలీలో తెలుగు భాష, సంస్కృతి సేవ ధ్యేయంగా సిలికానాంధ్ర జరుపుతున్న పలు కార్యక్రమ వివరాలను కంప్యూటర్ చిత్ర ప్రదర్శన ద్వారా వివరించారు. సాహితీ, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల సమ్మేళనంగా జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ ఆవుల మంజులత, భాషావేత్త చేకూరి రామారావు, రచయిత ద్వా.నా. శాస్త్రి, తెలుగు వర్శిటీ రిజిస్ట్రార్ భక్తవత్సల రెడ్డి, అంతర్జాతీయ తెలుగు కేంద్రం అధ్యక్షులు ఆచార్య గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.